షష్టిపూర్తి కథలు

# క్లబ్బు

**—ముక్తేవి భారతి**

టీపాయ్ పైన టేబుల్ క్లాత్ మడిచి వేసింది సుధ. పొద్దున్న చాలాసేపు కష్టపడి చేసిన మిక్స్చరు చిన్న గిన్నెలో పోసి రెండు చెంచాలు వుంచిందా గిన్నెలో. ఆ తర్వాత లోపలకెళ్లి పౌడరు రాసుకుని, స్ప్రే వేసుకుని జుట్టు రబ్బరు బాండ్ మరోసారి తీసి పెట్టుకుంది సుధ. రవి తాగుతున్న సిగరెట్ ఆర్పి యాష్‌ట్రేలో పడేసాడు. కళ్లజోడు తీసి తుడుచుకుని మళ్ళీ పెట్టుకున్నాడు.

సిల్కులాగా జారిపోతున్న ప్లాస్టిక్ కార్డులు చేతిలోకి తీసుకుంటూ ''నీతో ఆడడంవల్ల నా ఆట అంతా పాడయిపోతోంది. క్లబ్బులో ఎప్పుడూ గెలుస్తూ వుండే నేను నీతో మొదలు పెట్టాక...'' రవి పేకముక్కలు కలిపి పంచాడు. నిజానికి సుధకి పేకాట నేర్పింది రవే. భార్యాభర్త, ఇంటికొచ్చే అన్నా వదినలతో కలిసి సరదాగా ఆట ఆడుకోవడం చాలాకాలంగా వుంది. ముక్కలు చేతిలో వుండక జారిపోవడం, గబగబా తీసి సర్దుకోవడం సుధకి అలవాటే. ఆ అలవాటు పోటంలేదు. పైగా ఈమధ్య చాలా పట్టుదలగా పేకాట ఆడుతోంది కూడా.

ఒక్కమాట మాట్లాడకుండా ఆటలో మునిగిపోయిన భార్యనిచూస్తే నవ్వొచ్చింది రవికి.

''నిజంగా నువ్వు క్లబ్బుకొచ్చి పేకాట ఆడాలనేనా?'' అన్నాడు.

''అవును. నిజంగానే'' అంది సుధ పేకముక్కల్లోనే చూపు నిలిపి.

సుధ, రవి ఒకే బాంకులో పనిచేసి వారంరోజుల తేడాలో రిటైరైపోయారు. అసలు ఆ బాంకులో చేరిన మధురక్షణాలేమిటోగానీ ప్రేమించి పెళ్లిచేసుకోవడం, ఆర్నెల్లు తిరిగేసరికి అయిపోయింది. అదీ కులాంతర వివాహం. అయినా ఏనాడూ ఇద్దరి మధ్యా ఎలాంటి అభిప్రాయబేధాలు లేకుండా ఇన్ని ఏళ్లు గడిచిపోయాయి. సుధకి ప్రమోషన్‌పైన మరో ఊరు వేస్తే చాలా తేలిగ్గా, హాయిగా ప్రమోషన్‌ని వదులుకుంది.

''ఆ...నా భర్తా, కొడుకు ఇక్కడ, నేనక్కడానా? నాన్‌సెన్స్. మై ఫస్ట్ ప్రిఫరెన్స్ ఈజ్ మై ఫామిలీ'' అంది.

అసలు సమస్య ఇప్పుడు మొదలైంది. కొడుకు ఇంజనీర్. కోడలు ఇల్లు చూసుకుంటుంది. ఇద్దరాడపిల్లలు. పనులు చేయడానికి పనిమనిషి.

''సుధా! నెలరోజులు ఎక్కడికైనా వెళ్లివద్దాం. రోజూ ఆఫీసులో గడిపేవాళ్ళం. ఇప్పుడేం చేయాలో తోచడంలేదుకదూ'' అన్నాడు రిటైరయిన నాలుగో రోజు రవి. సుధ మాట్లాడలేదు. తన సమస్యా అదే!

''మీరు క్లబ్బులో మెంబరయితే మీ భార్యగా నేనూ మెంబర్నే.''

> **భర్త కారు డ్రైవ్ చేస్తున్నాడు. సుధ ఆలోచనలు ఎక్కడికో వెళ్లిపోయాయి. తను క్లబ్బుకెళ్లి పేకాట ఆడడంలో తప్పులేదు — కానీ ఇంటి వాతావరణంలో అశాంతి వచ్చేసింది అప్పుడే. తరతరాలుగా వున్న మన భావాలు ఒక్కసారి మారుతాయా?**

''ఆ...''

''రోజూ ఈవినింగ్ క్లబ్‌కెళ్ళి పేకాట ఆడుకుందామండీ!''

''ఏమిటీ!'' చేతిలోవున్న సిగరెట్ పడేసాడు రవి.

''అంత ఆశ్చర్యమేమిటి? మీరే చెప్పారుగా క్లబ్బులో చాలామంది ఆడవాళ్ళు కూడా ఆడతారు. అదేం తప్పుకాదు'' అంది సుధ తెల్లని వెంట్రుకలు మెరుస్తుంటే జుట్టు ముడి వేసుకుంటూ.

ఆ ఆలోచన సుధ మనసులో ఇంతింతై పెరిగింది. పగలు ఇంట్లో ఏవో పనులుంటాయి. మధ్యాహ్నం నిద్రపోవచ్చు. సాయంత్రం క్లబ్బుకెళ్లొచ్చు. అంతే!

ఓరోజు భర్త భోజనం చేసాక నిద్రపోతుంటే తను తన అన్నగారింటికి వెళ్లింది. అక్కడ అన్నా వదినా ఆమె చెల్లెలు వున్నారు. అంతా కలిసి పేకాట ఆడారు. గడియారం మూడు గంటలు కొట్టడంతో గబగబా బయల్దేరి ఇంటికొచ్చేసింది సుధ.

''ప్లీజ్ నాకు నేర్పండి. ఇంట్లో ఇద్దరం సరదాగా ఆడుకుందాం. నాకు బాగా ఆట వచ్చిందని నమ్మకం వచ్చాక క్లబ్బుకి వస్తాను'' అని బతిమాలింది భర్తని సుధ.

మొత్తంమీద సాయంత్రం దాటేసరికి టీపాయ్‌మీద క్లాత్ పరచి పేకలున్న పెట్టె తెచ్చి పెడుతుంది సుధ. అలా అలా రోజూ భర్తతో పేకాట ఆడడం మొదలై నిజంగానే గెలుపులోకి వచ్చేసింది సుధ.

రెండో బెడ్‌రూమ్‌లోంచి మాటలు కొన్ని వినిపిస్తున్నాయి.

''ఈ ముసలాళ్లిద్దరూ రిటైరై వచ్చిన ఆ నాలుగు డబ్బులూ పేకాటలో తగలేస్తారు కాబోలు. ముందే చెప్తున్నా మీ ఇష్టం'' సరోజ గొంతు.

''నీ మొఖం. అసలు మా అమ్మకి ఆట రాదు. ఊరికే కాలక్షేపానికి. ఇది మంచిదే. ఇంట్లో ఆడుకుంటున్నారు. క్లబ్బుకి వెళ్లడం లేదు సంతోషించు'' అన్నాడు సూర్యం.

''క్లబ్బుకెళ్లి పేకాట ఆడి గెలవాలని మీ అమ్మ పెద్ద కోరిక'' అంది సరోజ.

సరోజకి చాలా కోపంగా వుంది ఈ పేకాట విషయం. అయినా రిటైరయ్యాక రామా...కృష్ణా అనుకోవడం విందిగానీ ఇదేమిటీ... మా అమ్మానాన్నా వింటే నవ్వుతారు. ఎందుకూ అప్పట్లో అదే ముప్ఫై ఏళ్ళనాడు ఆ ప్రేమ వివాహంలో కూడా ఈవిడే పాపం మామగారు, అమాయకుడే బుట్టలో పడేసి రిజిస్టర్ మారేజ్ చేసుకుందిట. పాపం మా మామగారి తండ్రి ఆ దెబ్బతో తిరగలేకపోయాడట. తన తల్లి చెప్పిన మాటలన్నీ ఒకటి ఒకటి నెమరు వేసుకుంటూ. అత్తగారు పేకాట ఆడడానికి వీల్లేదని గట్టిగా పట్టుదల పట్టాలని నిర్ణయించుకుంది సరోజ. ఈ విషయాన్నే భార్యాభర్త చాలాసార్లు పోట్లాడుకున్నారు.

''వాళ్లిష్టం. కష్టపడి జీవితమంతా సంపాదించి మనకి కట్టబెట్టారు. ఇప్పుడు రిటైరయి [illegible]

ఎంజాయ్ చేస్తే నీకేం కష్టం. నోరు మూసుకో'' అన్నాడు సూర్యం ఓ రోజు భార్యతో.

రవి, సుధలకి తెలుసు కొడుకూ కోడలూ పడుతున్న గొడవ. ఇందులో రెండు గొడవలు, పేకాట ఒకటీ, అత్తగారు క్లబ్బుకెళ్లి పేకాటతాననడం ఒకటీ.



• • •

ఆ రోజు రవి, సుధ బయలుదేరారు క్లబ్బుకి.

''మేం రాత్రి వచ్చేసరికి పొద్దుపోతుంది. మీరు భోజనం చేసేయండి'' అంది సుధ గుమ్మంలో నుంచున్న సరోజతో. సరోజ ముఖంలో కోపం సుధ గుండెల్ని దూసుకుపోయింది.

భర్త కారు డ్రైవ్ చేస్తున్నాడు. సుధ ఆలోచనలు ఎక్కడికో వెళ్లిపోయాయి. తను క్లబ్బుకెళ్లి పేకాట ఆడడంలో తప్పులేదు - కానీ ఇంటి వాతావరణంలో అశాంతి వచ్చేసింది అప్పుడే. తరతరాలుగా వున్న మన భావాలు ఒక్కసారి మారుతాయా?

''ఇదిగో, నన్నిక్కడ మీ పిన్నిగారింట్లో దింపండి. మీరు క్లబ్బునుంచి వచ్చేటప్పుడు నన్ను తీసికెళ్ళండి'' అంది సుధ. ఒక్క నిముషం విస్తుపోయిన రవి ''అదేమిటీ?'' అన్నాడు.

''ఇప్పుడు గుర్తొచ్చింది. ఓ ముఖ్యమైన విషయం పిన్నితో మాట్లాడాలి'' అంది ఎటో చూస్తూ. కారు పిన్నిగారింటిముందు ఆగింది.

సుధ రవితో రోజూ క్లబ్బుకి బయలుదేరుతోంది. కొడుకూ కోడలు ముఖాలు ముడుచుకుంటున్నారు.

• • •

''పిన్నీ! పిల్ల ఎంత యాక్టివో చూసావుగా. పైగా కంప్యూటర్ కోర్సులన్నీ చేసేసింది. వాళ్ళ అమ్మ నాన్నా ఒకటే గొడవ పడిపోతున్నారు పిల్ల పెళ్లి విషయం. నాకు నువ్వు గుర్తొచ్చావు'' అంది సుధ రామలక్ష్మితో.

''నీ ఫోన్ నెంబర్ కలవక నానా ఇబ్బంది పడుతున్నా. నేనే వద్దామనుకుంటున్నా మీ ఇంటికి? వచ్చి సరితని చూడాలని'' అంది.

''పద ఇవాళ బాగుంది'' అంది సుధ.

రామలక్ష్మి తమ్ముడు కొడుకు అమెరికాలో ఇంజనీర్. అలా వచ్చి ఇలా పెళ్లి చేసుకుపోతాడని ఓసారి రామలక్ష్మి సుధతో చెప్పింది. అప్పటినుంచి సుధ మనసులో ఇదే ఆలోచన. మనవరాలి పెళ్లి చేయాలి త్వరగా.

రాత్రి ఎనిమిది గంటలకి ఎవర్నో వెంటబెట్టుకొచ్చిన అత్తగార్ని చూసి కాస్త చిరాకుపడ్డా రెండు గ్లాసుల మంచి నీళ్ళు తెచ్చి బల్లమీద పెట్టింది సరోజ.

''ఆ పేకాట స్నేహితురాలులా వుంది సరితా మీ బామ్మ ఫ్రెండు'' అంది గదిలో చదువుకుంటున్న కూతురితో సరోజ.

''సరితా! ఇటురా'' అంది సుధ.

''అందుకే బామ్మంటే కోపం. ఇప్పుడు ఈ నైటీ మార్చి...'' సరిత విసుక్కుంటోంది.

''ఇప్పుడు ముస్తాబవక్కర్లేదు. రేపవుదువుగానీ. అలా వచ్చేయ్'' అంది సుధ.

గులాబీరంగు నైటీలో తెల్లగా, సన్నగా, అందంగా మెరిసిపోతున్న మనుమరాలివంక ఎంతో గొప్పగా చూస్తూ-

''దీనికి కంప్యూటరే కాదు, ఇంకా చాలా వచ్చు పిన్నీ'' అంది సుధ రామలక్ష్మితో.

''కారు డ్రైవింగ్ వచ్చా?'' అంది ఆవిడ.

''ఆ...'' అంది గ్లాసులు లోపలకు తీసుకువెళుతూ.

రామలక్ష్మి, సుధ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఎప్పటినుంచో ఇద్దరికీ స్నేహం. మనవరాలికి రాజీవ్‌తో పెళ్లి కుదర్చాలని సుధ చాలా రోజులుగా అనుకుంది.

''పనయిందిగా వెళ్లిరానా'' అంది రామలక్ష్మి.

''సరితా! బొట్టు పెట్టుకురా'' అంది సుధ.

• • •

పదిహేను రోజులు గడిచాయి. మనవరాలి పెళ్లి రాజీవ్‌తో జరిపించేసింది సుధ.

''ఇప్పుడు చెప్పు. మా అమ్మ పేకాట అడితే తప్పా?'' అన్నాడు సూర్యం భార్యతో. సరోజ ముఖం నిండా ఆనందమే.

''అత్తగారు మనవరాలి పెళ్లి గురించే హైరానాపడ్డారుగానీ, క్లబ్బుకెళ్ళందే'' అంది సరోజ గలగలా నవ్వి.

''నాన్న ఆ విషయం నీకు చెప్పాడా?'' అన్నాడు సూర్యం.

కర్టెన్ కదిలింది.

''మీ నాన్న నోట్లో నువ్వుగింజ నానుతుందా'' అంది సుధ పక్కనున్న మనవరాలు సరిత బుగ్గ గిల్లి.

''రేపట్నుంచీ క్లబ్బుకెడతాను'' అంది భర్తవైపు చూసి నవ్వుతూ సుధ.

★